సినీ దర్శకుడు బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియలకు విచ్చేసిన సుకుమార్ - 7లో

రాళ్లను ఢీకొని బోటు ధ్వంసం - 7లో

తునిలో అనుమానాస్పద మృతిపై వీడిన మిస్టరీ - 7లో



భానుడి.. ఉగ్రరూపం

- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రెండురోజులుగా 43 డిగ్రీలు దాటిన వైనం
- విద్యుత్తు సరఫరా అంతరాయంతో అల్లాడిపోతున్న జనం
- పెరిగిన ఏసీల వినియోగం

కలెక్టరేట్(కాకినాడ), మే 31: భానుడు ఉగ్రరూపం దాల్చడంతో జనం అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో 21 మండలాలు ఉండగా రెండురోజులుగా ఎండలు పెరిగి పోయాయి. దీనిలో అత్యధిక మండలాల్లో 40 డిగ్రీల దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రధానంగా కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, కిర్లంపూడి, తుని, తాళ్లరేవు, కత్తిపూడి, అన్నవరంల్లో ఎండలు మండుతున్నాయి. ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జనం బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. వాతావరణం అగ్ని కుంపటిలా తయారైంది. దీంతో ఉదయం 10 గంటల లోపే ప్రజలు తమ పనులను పూర్తి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. ఇవి జిల్లాకు రావడానికి మరో ఐదు నుంచి ఏడు రోజులు సమయం పడుతుందని వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు

జిల్లాలో మెట్టప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బావులు, చెరువుల్లో నీరు కనిపించడం లేదు. 20 నుంచి 40 అడుగుల వరకు నీరు అడుగంటిపోయినట్లు నిపుణులు చెబుతున్నారు. పశువులకు నీరు అందించడానికి కూడా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలువలు ఎండిపోయి బీడ్లను తలపిస్తున్నాయి.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

జిల్లాలో ప్రధాన పట్టణాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కాకినాడ నగరంలో రెండురోజులుగా అర్ధరాత్రి 2గంటల సమయంలో అరగంట విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతోంది. వినియోగానికి సరిపడే సరఫరా చేయకపోవడంవల్లే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు చెప్తున్నారు.

తట్టుకోలేక ఏసీలు

జిల్లాలో ఏసీల వినియోగం గణనీయంగా పెరిగింది. జనం ఉక్కపోత తట్టుకోలేక ఏసీలను అధికంగా ఉపయోగిస్తున్నారు. దీంతో విద్యుత్తు వినియోగం పెరిగిపోయింది. పెద్దఎత్తున ఏసీల కొనుగోలుతో వీటికి డిమాండ్ భారీగానే పెరిగింది.

40 నుంచి 43 డిగ్రీలు నమోదు

రెండురోజులుగా జిల్లాలో పలు ప్రాంతాల్లో 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. మరో రెండురోజుల్లో ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు దాటే అవకాశం ఉన్నట్లు చెప్తున్నారు.

పిల్లలు, వృద్ధులు బయటకు రావద్దు

పిల్లలు, వృద్ధులు, గర్భిణులు బయటకు రావద్దని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున వీరు వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని సూచనలు ఇచ్చారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు మంచినీరు, కొబ్బరినీరు, గ్లూకోజ్, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

తాగునీటికి ఇక్కట్లు



ఏలేశ్వరం పట్టణంలో పనిచేయని చేతిపంపు

- అధ్వానంగా వాటర్ ట్యాంక్‌లు
- పనిచేయని చేతి పంపులు

ఏలేశ్వరం, మే 31: జిల్లాలో పలుచోట్ల తాగడానికి మంచి నీరు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అవస్థలను చూసైనా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలేదు. ఏలేశ్వరంలో ఈ పరిస్థితి దయనీయంగా ఉంది.

ఎన్నోఏళ్ల నుంచి ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో అప్పన్నపాలెం ప్రజలు సుద్దనీటినే తాగుతున్నారు. ఏ ప్రాంతంలో బోర్లు వేసినా సుద్దనీరే రావడంతో తాగేందుకు మంచి నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతవాసులకు తాగునీరు అందించేందుకు జీఎల్ఆర్ ట్యాంకును నిర్మించారు. దీనినుంచి సుద్దనీరే రావడంతో ఈ నీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. సాయిబాబా మెట్ట మీద ఉన్న వాటర్ ట్యాంకు నాచు పేరుకుపోవడంతో పైపుల నుంచి కుళాయిల ద్వారా నీటితోపాటు నాచు వస్తుండడంతో ప్రజలు తాగునీటికి పాట్లుపడుతున్నారు. చుట్టూ పిచ్చి తుప్పలు మెలవడంతో దాని చుట్టూ ఉన్న పైపులు దెబ్బతిన్నాయి. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో ట్యాంకుపై మొక్కలు మెలవడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. అధికారులు వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం కానీ తుప్పలను తొలగించడంపై ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. అధికార యంత్రాంగం స్పందించి ట్యాంకుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు. తాగునీటి కోసం సమీప ఏలేరు కాలువలోని చలమలపై ఆధారపడుతున్నారు.

గాలికొదిలేసిన చేతిపంపులు

వేసవిలో అత్యవసర పరిస్థితుల్లో తాగునీటిని సరఫరా చేసే చేతిపంపుల నిర్వహణను నగర పంచాయతీ అధికారులు గాలికొదిలేశారు. కనీసం మరమ్మతుల నిమిత్తం చిల్లి గవ్వ కూడా ఖర్చు పెట్టకపోవడంతో తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. పట్టణంలో 180కిపైగా చేతి పంపులు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులు చేసేందుకు పనికి రాకుండా ఉన్నాయి. కుళాయిలు రాని సమయంలో చేతిపంపులే ఆధారంగా నిలిచేవి. వార్డుల్లో చేతిపంపులు ఉన్నా వాటి నిర్వహణ లేకపోవడంతో మూలకు చేరాయి. పలు వార్డుల్లో మరమ్మతుల కోసం తీసుకెళ్లిన చేతిపంపులు నెలలు గడిచినా నేటికీ అమర్చకపోవడంతో ప్రజలకు తాగునీటి వెతలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టెన్షన్.. టెన్షన్



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)



- అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఇంకా మూడురోజులే గడువు
- ఫలితాలెలా ఉంటాయోనని జిల్లాలో పార్టీల అభ్యర్థుల్లో గుండె దడ
- అన్ని సీట్లు క్లీన్ స్వీప్ ఖాయమంటూ టీడీపీ, జనసేనలో ధీమా
- ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థుల్లో కలవరం
- నేడు సాయంత్రం విడుదలకానున్న ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీలో మరింత టెన్షన్
- జిల్లావ్యాప్తంగా 602మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసిన పోలీసులు
- అందులో ముగ్గురిని జిల్లా బహిష్కరణకు చర్యలు

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఇంకా మూడురోజులే సమయం ఉండడంతో సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఫలితాలు ఎలా ఉంటాయనేదానిపై పార్టీల అభ్యర్థుల్లో గుండె దడ పెంచుతోంది. విజయం ఎవరిని వరిస్తుందోననే బెంగ వెన్నాడుతోంది. అటు జిల్లాలో అన్ని సీట్లు క్లీన్ స్వీప్ ఖాయమని టీడీపీ, జనసేన ధీమా కనబరుస్తున్నాయి. కూటమి ప్రభావం జిల్లాలో ఓట్ల సునామీ సృష్టించిందని, ఈ నేపథ్యంలో అన్ని సీట్లు తమవేనని అంచనాలు వేస్తున్నాయి. అటు అధికార వైసీపీలో మాత్రం నిర్లిప్తత చోటుచేసుకుంది. సర్వేలన్నీ తమకు వ్యతిరేకంగా ఉండడంతో అసలు గెలుస్తామో లేదోనన్న బెంగ వెన్నాడుతోంది. ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ శనివారం విడుదలవనుండడంతో ఈ టెన్షన్ మరింత పెరిగింది. బయటకు మాత్రం తాము తీవ్ర పోటీ ఇస్తున్నామంటూ ప్రచారం చేస్తున్నారు. కాగా మంగళవారం ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారులు కాకినాడ జేఎన్టీయూలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆరోజు ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ఏ అవాంతరాలు లేకుండా మొదలయ్యేలా కౌంటింగ్‌పై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఫలితాల వెల్లడి నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 602మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసింది.

అటు ధీమా.. ఇటు హంగామా..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలసరళి ఎలా ఉంటుందనేదానిపై 18రోజులుగా జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మే 13న పోలింగ్ ముగిసినప్పటినుంచి ప్రతిఒక్కరూ ఫలితాలపైనే ఎక్కడికక్కడ రకరకాల చర్చలు కొనసాగిస్తున్నారు. ఉద్యోగులనుంచి రైతులు, వ్యాపారులు, యువత, మహిళలు.. ఇలా అన్ని వర్గాలు ఫలితాల తీరుపై రకరకాల లెక్కలతోవిశ్లేషణలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపునకు ఇంకా మూడు రోజులే గడువు మిగిలి ఉండడంతో ఈ ఉత్కంఠ మరింత పెరిగింది. ఇన్ని రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఫలితాలు వెల్లడికి సమయం దగ్గరపడడంతో అధికారంలోకి వచ్చే పార్టీ ఏదనేది చర్చనీయాంశంగా మారింది. అన్ని సర్వేలు టీడీపీ కూటమి అధికారంలోకి ఖాయమని ఘంటాపథంగా చెప్తుండడంతో సీట్లు ఎన్ని వస్తాయనే చర్చ ప్రజల్లో మరింత ఆసక్తి రేకిత్తిస్తోంది. టీడీ పీ, జనసేన అభ్యర్థులు ఫలితాలు ఏకపక్షమేనని చెప్తున్నారు. జిల్లాలో అన్ని సీట్లు క్లీన్‌స్వీప్ ఖాయమని వివరి స్తున్నారు.

పిఠాపురంలో పవన్ గెలుపు ఖాయం

పిఠాపురం నుంచి పవన్ తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమైపోయిందన్న విషయాన్ని బలంగా చెప్తున్నారు. మెజార్టీ లెక్కలే తేలాల్సి ఉందని గుర్తుచేస్తున్నారు. వైసీపీలో మాత్రం ఫలితాలపై టెన్షన్ నెలకొంది. అధికారం చేజారిపోవడం పక్కా అని సర్వత్రా చర్చ జరుగుతుండడం, సర్వేలన్నీ ఇదే విషయాన్ని నొక్కి చెబుతుండడంతో కలవరపడుతోంది. అసలు జిల్లాలో వచ్చే సీట్లపైనా స్పష్టత లేకపోవడంతో తలపట్టుకుంటోంది. ఆ పార్టీ అభ్యర్థులు గెలుపు పక్కా అని బయటకు చెప్తున్నా విజయంపై నమ్మకం లేక గుబులు చెందుతున్నారు. ఏ నోట విన్నా కూటమికే ఓట్లు పడ్డాయన్న సంభాషణలు వినిపిస్తుండడంతో ఓటమి తప్పదనే భయం నిద్ర లేకుండా చేస్తోంది. దీనికితోడు ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ శనివారం సాయంత్రం 6గంటల తర్వాత విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో చేదు ఫలితాలు తప్పవనే నిజం ఎగ్జిట్ పోల్స్ ద్వారా వెల్లడవుతాయన్న భయం వెన్నాడుతోంది. ఫలితాల వెల్లడి సమయం దగ్గర పడడంతో అటు టీడీపీ, వైసీపీ అభ్యర్థులు విహార యాత్రల నుంచి ఇప్పుడిప్పుడే తిరిగి నియోజకవర్గాలకు చేరుకుంటున్నారు. కౌంటింగ్ ఏజెంట్ల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ సమయంలో గొడవల విషయంలో తగ్గొద్దని వైసీపీ ఇప్పటికే తమ అభ్యర్థులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే అభ్య ర్థులు తమ ఏజెంట్ల విషయమై ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి పేర్ల జాబితా అధికారులకు పంపించారు.

ఓట్ల లెక్కింపునకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 31: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలవద్ద ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా కాకినాడ జేఎన్‌టీయూలో వివిధ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌ల, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. జేఎన్‌టీయూ వీసీ సమావేశమందిరంలో వివిధ శాఖల అధికారులతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, ఏఎస్పీ భాస్కర్‌రావు, డీఆర్వో తిప్పేనాయక్ పాల్గొన్నారు.

602మంది రౌడీషీటర్ల బైండోవర్..

మంగళవారం ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఆర్వోతోపాటు ఇతర కౌంటింగ్ సిబ్బందికి ఓట్ల లెక్కింపునకు సంబంధించి విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. రౌండ్లవారీగా ఫారం-17 ఎలా నింపాలి? ఏజెంట్ల అభ్యంతరాలకు సంబంధించి వేటిని పరిగణనలోకి తీసుకోవాలి? వంటి వాటిపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ రోజు కాకినాడ జేఎన్టీయూకు ఉదయం 6గంటలకే అంతా రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఉదయం 8గంటల నుంచి తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలని వివరించారు. మొత్తం ఏడు నియోజకవర్గాలు, కాకినాడ ఎంపీ సీటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ అన్ని రౌండ్లు ముగిసేసరికి సాయంత్రం 4గంటలు అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోపక్క ఫలితాల వెల్లడి రోజున నియోజకవర్గాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. సున్నిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరిస్తోంది. ఊరేగింపు, బాణాసంచాపై నిషేధం విధించింది. జిల్లా కేంద్రం కాకినాడలో అన్ని హోటల్స్, మద్యం దుకాణాలను మంగళవారం మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆయా స్టేషన్లపరిధిలో సిబ్బంది హోటళ్లకు వెళ్లి యజమానులకు నోటీసులు ఇచ్చారు. మద్యం దుకాణాలను కూడా మూసివేస్తున్నారు. ఫలితాల రోజున అల్లర్లు, ఇతర గొడవలకు పాల్పడే ప్రమాదం ఉన్న హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో 602మంది పాత రౌడీషీటర్లను పోలీసులు గుర్తించారు. వీరందరినీ బైండోవర్ చేశారు. వీరిలో ముగ్గురు కరుడుగట్టిన రౌడీషీటర్లను జిల్లానుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ మేరకు కలెక్టర్ అనుమతిని పోలీసుశాఖ కోరింది.

అమ్మో 'జూన్'!

- ఒకవైపు ఎన్నికల ఫలితాల టెన్షన్
- విద్యాసంవత్సరం మొదలు కానుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల టెన్షన్



సామర్లకోట, మే 31: జూన్ నెల అంటే విద్యార్థుల తల్లిదండ్రులకు హడలే. ముందునుంచే టెన్షన్ మొదలవుతుంటుంది. పిల్లలకు పుస్తకాలు, యూనీఫాం దుస్తులు, బ్యాగులు, షూ వంటి కొనుగోలుతోపాటు విద్యాసంస్థలకు ఫీజులు చెల్లించడం వంటి ఖర్చులు ఉంటాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పదు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న పడింది. బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజల్లో టెన్షన్ నెలకొంది. పోలింగ్ ముగిసి రెండు వారాలు దాటింది. ఫలితాలు ఎవరికి అనుకూలం, ఎవరికి వ్యతిరేకంగా ఉంటాయో అనే ఉత్కంఠ అందరిలో ఉంది. ఎక్కడ చూసినా పోలింగ్ సరళిపైనే చర్చలు జరుగుతున్నాయి. కాగా పోటీలో ఉన్న నాయకుల్లో రిలాక్స్ కోసం వివిధ పర్యాటక ప్రాంతాలకు వెళ్లి బుధవారం నాటికి తిరిగి వచ్చేశారు. వారు కూడా గంటలు లెక్కపెడుతున్నారు. మరోవైపు పెద్దఎత్తున బెట్టింగులు సాగుతున్నాయి. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ కాయ్ రాజా కాయ్ అంటున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీకి అధికారం వస్తుంది, జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, అన్నదానిపైనే ఎక్కువ మంది పందాలు కడుతున్నారు. పెద్దాపురం, పిఠాపురం, జగ్గంపేట, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాలపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మరో వైపు ఎన్నికల ఫలితాలపై అనేక సర్వేసంస్థలు సోషల్ మీడియాలలో హల్‌చల్ చేస్తున్నాయి. వీటిలో ఒక్కో నియోజకవర్గం ఫలితం ఒక్కోలా ఉంటోంది.

మార్కెట్ కమిటీల సేవలేవి?

- అక్కరకురాని రైతుబంధు పథకం
- అనుబంధ రహదారులు సున్నా
- వైద్య శిబిరాల ఊసేలేదు
- గోదాముల నిర్మాణం గాలికి
- ఐదేళ్లుగా కొత్త పథకాలు నిల్
- అవస్థలు పడుతున్న అన్నదాతలు

పెద్దాపురం, మే 31: రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపై ఒక శాతం సెస్సు(పన్ను)ను ముక్కుపిండి వసూలు చేస్తున్న మార్కెట్ కమిటీలు.. వారి సంక్షేమాన్ని మాత్రం పూర్తిగా విస్మరించాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం కమిటీల ఖాతాల్లో చేరుతున్నా ఆ నిధులను వారి కోసం ఖర్చు చేయడం లేదు. ఐదేళ్లలో ఉన్న పథకాలను కూడా ఎత్తేసి అవస్థలకు గురిచేస్తోంది. కమిటీలనుంచి పూర్తిగా రైతుకు ఏఒక్క ప్రయోజనం కూడా కలగడం లేదు. ఇదేనా ప్రభుత్వం తమకు వేసిన పెద్దపీట అని కర్షకులు మండిపడుతున్నారు.

రైతుబంధు దూరం..

ఐదేళ్లుగా అన్నదాతలకు రైతు బంధు పథకం అక్కరకు రాలేదు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లేని పక్షంలో కమిటీలు కుదువ పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. పంట విలువలో 80శాతం వరకు రుణంగా ఇచ్చే అవకాశం ఉంది. ధర వచ్చాక ఆయా ఉత్పత్తులను విక్రయించి రుణాలనుతిరిగి తీసుకునే వెసులుబాటు కమిటీలు కల్పించాలి. జిల్లాలోని 9 మార్కెట్ కమిటీల పరిధిలో లక్షమంది రైతులు ఉన్నారు. ఐదేళ్లుగా ఒక్క రైతుకూ ప్రయోజనం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.

అనుబంధ రహదారులేవి?

వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రహదారులు నిర్మించాలి. గతంలో ఒక్కో కమిటీ పరిధిలో 30శాతం నిధులు ఇందుకు కేటాయించేవారు. ఒక్కో కమిటీ పరిధిలోని ప్రాధాన్యం మేరకు ఏడాదికి 10 నుంచి 15 రహదారులు వేసేవారు. రైతుల అభిప్రాయాలను తీసుకుని అవసరమైన మేరకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఈ ఐదేళ్లలో ఒక్క రహదారి కూడా వేయలేదు. అసలు వాటికోసం ప్రతిపాదనలు చేసిన దాఖలాలు కూడా లేవు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశాల్లో తీర్మానాలు చేయడమే తప్ప పనులు మాత్రం జరగలేదు.

వైద్య శిబిరాలు ఎత్తేశారు..

రైతుల ప్రత్యామ్నాయ ఆర్థికవనరుగా ఉండే పాడి సంపద అభివృద్ధికి కూడా మార్కెట్ కమిటీలు పెద్దపీట వేసేవి. ఏడాదికి నాలుగ పశువైద్య శిబిరాలను ఏర్పాటుచేసేవారు. ఒక్కో శిబిరానికి రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకూ ఖర్చు చేసేవారు. ఐదేళ్లగా ఆయా శిబిరాల నిర్వహణ లేదు. ఇంతకీ ఆయా నిధులు ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి. వ్యాధులతో బాధపడుతున్న పశువులను ఒకేచోటకు చేర్చి సంపూర్ణ వైద్యం అందించి ఉచితంగా మందులను కూడా ఇచ్చేవారు. అవన్నీ ఎత్తివేశారు. పాడి పశువులకు చికిత్స కోసం రైతు సొంతంగా ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది

గోదాములు లేవు..

మార్కెట్ కమిటీల నిధులతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించాలి. ఐదేళ్లలో ఒక్కటి కూడా నిర్మించిన దాఖలాలు లేవు. దీనివల్ల మార్కెట్ కమిటీలకు ఆదాయం పోతోంది. రైతులు ప్రైవేటు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని రుసుములు చెల్లించుకుంటున్నారు. దీనివల్ల పంట అమ్మిన మొత్తంలో సగం వరకూ వాటికే ఖర్చవుతోంది. రైతులు దళారుల వలలో పడకుండా ఈమార్కెటింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆన్‌లైన్ కొనుగోళ్లు జరపాలని నిర్ణయం తీసుకుంది. ప్రతి మార్కెటింగ్ కమిటీ కొనుగోలు కేంద్రంగా మార్చాలని ప్రతిపాదించారు.

కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిలో అమ్మకానికి ఉద్యోగాలు

- ఎంపీ వంగా గీతపై మాజీ ఎమ్మెల్యే వర్మ సంచలన ఆరోపణలు

పిఠాపురం, మే 31: కాకినాడలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని ఎంపీ, పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌పై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సంచలన ఆరోపణలు చేశారు. పిఠాపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వర్మ మాట్లాడుతూ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఉన్న తాత్కాలిక ఉద్యోగాల నిమిత్తం 25నుంచి 30మంది వద్ద రూ.10నుంచి 20 లక్షల వరకూ ఎంపీ గీత వసూలు చేశారని ఆరోపించారు. తనకు డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు వేయించడంతో ఆమె బీజీగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగాల వ్యవహారంలో కోట్లాది రూపాయిల భారీ స్కామ్ జరిగిందని, ఇందులో ఈఎస్ఐ డైరెక్టరుకు వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఎంపీ గీత ఒత్తిడి మేరకు నిబంధనలు పాటించకుండా ఉద్యోగులను నియమిస్తున్నారని తెలిపారు. వికాస ద్వారా తాత్కాలిక, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించాల్సి ఉండగా, ఆ విధంగా చేయడం లేదని చెప్పారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వారికి సమానంగా ఈఎస్ఐలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణం ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ వ్యవహారంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా కేంద్రానికి ఫిర్యాదు చేసి విచారణ కోరతామని వర్మ తెలిపారు. దీనిపై తాము పోరాటం జరుపుతామని, బాధ్యులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఇదే తరహాలో ఇప్పటికే పిఠాపురం పురపాలకసంఘంలో ఉద్యోగాలను అమ్మివేశారని ఆరోపించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఎవరయినా విజయం సాధించాలని కోరుకుంటూ ఆలయాలకు వెళ్తారని, ఎంపీ గీత రూట్ అంతా సపరేటు అని ఎద్దేవా చేశారు. ఆమె తనకు లక్ష్మీదేవి ఉంటే సరిపోతుందని భావిస్తున్నారని, అంటే దేవుడు కాదని, సొమ్ములు వస్తే చాలని భావిస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో పోస్టుల భర్తీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఆగని అక్రమ తవ్వకాలు

- అధికారుల కళ్లుకప్పి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

తుని రూరల్, మే 31: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా మాకేంటి భయం అంటూ తుని రూరల్‌లో మట్టి మాఫియా చెలరేగుతోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ గట్టు మట్టిని గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు రాత్రివేళ తరలించేస్తూ కాసులు కొల్లగొడుతున్నారు. నాలుగురోజులుగా రాజుల కొత్తూరు సమీపంలో 373/5సర్వే నెంబరు ఆనుకుని అక్రమ మట్టి తరలింపు యథేచ్ఛగా జరుగుతోంది. భారీ వాహనాలు రంగంలోకి దించి రాత్రికి రాత్రే పోలవరం గట్టు మట్టిని మాయం చేస్తున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో బిజీబిజీగా గడిపితే అక్రమార్కులు సందట్లో సడేమియా అన్నట్లు పని కానిచ్చేస్తున్నారు. పగటివేళ తవ్వకాలు జరుపుతున్న సమయాల్లో మట్టి తవ్వకాలకు ఉపయోగించే మిషన్లు పొదల్లో దాచి రాత్రివేళల్లో మట్టి అక్రమాలు తవ్వకాలు చేస్తున్నారని స్థానిక రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికే మట్టితవ్వకాలు చేసి సమీప లేఅవుట్ల చదునుకు తరలించారని, అధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపు చర్యలను కట్టడి చేయాలని కోరుతున్నారు.



తుని రూరల్‌లో రాత్రివేళ మట్టిని తరలించగా మిగిలిన మట్టి దిబ్బ

ప్రకృతిని ఎరగా వేసి అటవీ అధికారుల దోపిడీ



గుడిసె విహార కేంద్రం

- గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిధుల్లో చేతివాటం
- కమిటీ లేకుండానే సీబీఈటీ కార్యకలాపాలు
- ఆకుమామిడికోటలో అనధికార చెక్‌పోస్టు

రమ్యమైన దుఃఖాన్ని సైతం మరిపించేది ప్రకృతి! ఈ ప్రకృతినే విహారం పేరుతో ఎరగా వేసి అటవీ అధికారులు పర్యాటకులను ఆకర్షించి, తద్వారా వచ్చే ఆదాయాన్ని తమ చేతివాటంతో దోచేయడం రంపచోడవరం అటవీ డివిజన్లో ప్రహసనంగా సాగుతోంది. రంపచోడవరం డివిజన్లోని పలు రేంజిల పరిధిలో పర్యాటకం కోసం పలు కమ్యూనిటీ బేస్డ్ ఏకో టూరిజం(సి.బి.ఇ.టి) ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో కీలకంగా మారేడుమిల్లి రేంజ పరిధిలోని గుడిసె, మారేడుమిల్లి, వాలమూరు గొంది సీబీఈటీల ద్వారానే పర్యాటకుల నుంచి ఆదాయం సమకూరుతోంది. ఇందులో గుడిసె సీబీఈటీకి పర్యాటకుల తాకిడితో పాటు ఆదాయమూ ఎక్కువే! ఈ సీబీఈటీ కార్యకలాపాల నిర్వహణలో సంబంధిత అటవీ అధికారుల తీరుపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

(రంపచోడవరం/మారేడుమిల్లి)

ముఖ్యంగా గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిర్వహణ చుట్టూనే అనేక ఆరోపణలు తిరుగుతున్నాయి. సీబీఈటీలకు గిరిజనులే సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారానే వాటి నిర్వహణ సాగించడం నిబంధన. ఈ ప్రకారం గుడిసె సీబీఈటీకి కమిటీని నియమించడం, కమిటీ ఛైర్మన్‌తో కలిపి ఇద్దరికీ జాయింట్ ఖాతాను మారేడుమిల్లిలోని యూనియన్ బ్యాంకులో ఖాతాను కూడా తెరిచారు. గుడిసె సీబీఈటీకి ఉన్న కమిటీని అక్టోబరు 2023లో అటవీ అధికార్లు రద్దు చేశారు. నేటికీ కొత్త కమిటీని నియమించకుండానే అధికారులే సీబీఈటీ కార్యకలాపాలను నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. గుడిసె విహారానికి వచ్చే పర్యాటకుల నుంచి అధికారికంగా కొంత అనధికారికంగా కొంత సొమ్ములను వసూలు చేస్తున్నారు. అధికారికంగా వసూలుచేసిన సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో వేయడం, ఆనక ఆ ఖాతా నుంచి సొమ్ములను డ్రా చేయడం సాగింది. ఈ విధంగా లక్షలాది రూపాయలను గత ఏడు నెలలుగా డ్రా చేశారని సమాచారం. కమిటీ లేకుండా బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములను ఎలా డ్రా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఆకుమామిడికోటలో చెక్‌పోస్టు

ఇక గుడిసె విహారయాత్రికులను క్రమబద్ధీకరించి రుసుము వసూలు చేసేందుకు



ఆకుమామిడికోటలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

సమీపంలోనే చెక్‌పోస్టును నిర్వహించేవారు. గతంలో రాజమండ్రి అటవీశాఖ సీసీఎఫ్ ఇక్కడకు పర్యటనకు వచ్చిన సమయంలో ఈ చెక్‌పోస్టును ఎత్తేయాలని ఇక్కడి అటవీ అధికారులకు సూచన చేశారు. ఆ మేరకు చెక్‌పోస్టును ఎత్తేశారు కూడా! తదనంతర కాలంలో గుడిసెకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుమామిడికోటలో చెక్‌పోస్టును ఏర్పాటుచేసి గుడిసెకు వచ్చే విహారయాత్రికుల నుంచి రుసుములు వసూలు చేస్తున్నారు. కానీ ఆకుమామిడికోటలో ఈ చెక్‌పోస్టు ఏర్పాటుకు సీసీఎఫ్ నుంచి ఎటువంటి అనుమతులూ లేవని సమాచారం. ఇదే నిజమైతే ఈ చెక్‌పోస్టు ద్వారా గుడిసె పర్యాటకుల నుంచి అనధికారికంగానే రుసుములు వసూలు చేస్తున్నట్టే! ఇదిలావుండగా ఈ ప్రాంతమంతా గిరిజన ప్రాంతం కావడం, అటవీ హక్కుల చట్టం పరిధిలోనిది కావడంతో గిరిజనులకు ఉన్న సామాజిక హక్కుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు సాగిస్తున్న ఈ కార్యకలాపాలకు సంబంధించి వుల్లంగి పంచాయతీలో పీసా గ్రామసభ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌కి 10 అవార్డులు

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన రాజమండ్రి తపాలా డివిజన్‌కి 10 అవార్డులు దక్కాయని సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు.

జీఎస్‌ఎల్‌లో నెలరోజులు ఉచిత వైద్య సేవలు

రాజానగరం, మే 31: నేటి నుంచి జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో నెల రోజులపాటు(జూన్1 నుంచి జూలై 1)వ తేదీ వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా కృతజ్ఞతా పూర్వకంగా నెల రోజులపాటు అన్నిరకాల టీ వైద్యసేవలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామని, నెలరోజులు మెడికల్ టెస్టులు, ఇన్వెస్టిగేషన్ల ఫీజుల్లో 50శాతం తగ్గిస్తామన్నారు. మందులు మాత్రం పేషెంట్లే కొనుగోలు చేసుకోవాలన్నారు. తమ సంస్థలైన రాజానగరం జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రి, రాజమహేంద్ర వరంలోని స్వతంత్ర ఆసుపత్రి, కేన్సర్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం, డిస్కౌంట్‌పై వైద్య సేవలు అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి లో ఉన్నవారికి యథావిధిగా ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకో వచ్చని డాక్టర్ గన్ని భాస్కరరావు పేర్కొన్నారు.

సినీ దర్శకుడు బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియలు

కొత్తపల్లి, మే 31: ప్రముఖ చలన చిత్రదర్శకుడు సానా బుచ్చిబాబు తండ్రి వెంకట్రావు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని కాకినాడజిల్లా కొత్తపల్లి మండలానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విషయాన్ని తెలుసుకొన్న సినీ డైరెక్టర్, బుచ్చిబాబు గురువు సుకుమార్ కొత్తపల్లి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పితృ వియోగంతో బాధడుతున్న బుచ్చిబాబును డైరెక్టర్ సుకుమార్ ఓదార్చారు.



కొత్తపల్లిలో బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియల్లో దర్శకుడు సుకుమార్





ఛత్తీస్‌గడ్ - ఏపీ రాష్ట్రాల సరిహద్దున ప్రధాన రహదారిపై బైటాయించిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కమిటీ

ఐదు మాసాల్లో 120 మంది ఆదివాసీల హత్య

- నిజ నిర్ధారణ కమిటీని అడ్డుకున్న పోలీసు బలగాలు
- బెదిరింపులు, బుజ్జగింపులు
- రాజ్యం పోలీసుల నిర్బంధఖాండను ఖండిద్దాం
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ ఆరోపణ

చింతూరు, మే 31 : ఛత్తీస్‌గడ్‌లో గత ఐదు మాసాలుగా మారణ ఖాండ జరుగుతోందని ఈ క్రమంలో మావోయిస్టుల ముద్రవేసి 120 మంది ఆదివాసీలను పోలీసు బలగాలు హత్య చేశాయని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. ఈ మేరకు కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతృత్వంలో 60 మందితో కూడిన నిజనిర్ధారణ కమిటీ గురువారం తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గడ్ చేరుకొని అక్కడి బాధిత కుటుంబాలను కలిసే ప్రయత్నం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ నారాయణరావు, మాదన కుమార స్వామి, జాబిలి (తెలంగాణ) నాయకత్వంలో బయలుదేరిన బృందాన్ని తెర్లగూడ వద్ద పోలీసు బలగాలు అడ్డుకున్నారన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపి వెనుతిరిగి వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆ ప్రకటనలో ఆరోపించారు. తామంతా ప్రయాణంతో అలసిపోయామని బీజాపూర్ చేరుకొని అక్కడ విశ్రాంతి తీసుకుంటామని ఎంతగా నచ్చచెప్పినా తమ మాటను పెడచెవిన పెట్టిన బలగాలు బెదిరింపులకు దిగాయని ఆరోపించారు. చివరకు కమిటీని భద్రాచలం తిప్పి పంపారన్నారు. దీంతో శుక్రవారం వయా చింతూరు మీదుగా దంతెవాడ చేరుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కుంట సరిహద్దున బలగాలు అడ్డుకోవడంతో పాటు తమను పారా మిలటరి బలగాలు చుట్టుముట్టాయన్నారు. దీంతో తాము రోడ్డుపైనే బైటాయించామని తెలిపారు. బలగాలు బుజ్జగించడం మొదలుపెట్టాయ న్నారు. ఛత్తీస్‌గడ్‌లో తరచూ కాల్పులు జరుగుతున్నాయని అక్కడకు వెళ్లడం సరికాదంటూ బలగాలు చెప్పాయన్నారు. చివరకు అక్కడి నుంచి కూడా తమను వెనక్కు తిరిగి పంపారన్నారు. ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న మారణఖాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, హక్కులను బలగా లు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కమిటీ తీవ్రంగా ఖండించింది. తమను ఛత్తీస్‌గడ్‌లోకి అనుమతించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మత్స్యకారుల మృతి

- బోలెరో వ్యాన్‌ను ఢీకొట్టిన బియ్యం లోడు ట్రాక్టర్
- మరో ముగ్గురికి గాయాలు
- చేపలవేటకు బయలుదేరిన పది నిమిషాలకే ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సూరిబాబు, సాయిబాబు



గుమ్మిలేరు వద్ద వ్యాన్, ట్రాక్టర్ ఢీకొట్టుకున్న దృశ్యం

ఆలమూరు, మే 31: చెరువులో చేపల వేటకు బయలదేరిన పది నిమిషాలకే వారు వెళుతున్న బోలెరా వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ శుక్రవారం తెల్లవారుజామున ఢీకొట్టడంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరువద్ద జరిగిన ఈరోడ్డు ప్రమాదంలో ఆలమూరు గ్రామానికి చెందిన లంకే సూరిబాబు(49), వనమాడి సాయిబాబు (59), కొప్పాడి రమణ, డొక్కాడి శ్రీనివాస్, వనమాడి మావుళ్లస్వామి బోలెరా వ్యాన్‌లో రాజానగరం మండలం తుంగపాడు గ్రామంలోని చెరువులో చేపలవేటకు తెల్లవారుజామున బయలుదేరారు. ఆలమూరు నుంచి బయలుదేరిన పది నిమిషాలలో గుమ్మిలేరు సమీపంలో మండపేట నుంచి ఆలమూరు వైపు వస్తున్న రేషన్‌బియ్యంలోడు ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న సూరిబాబు, సాయిబాబులు అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న రమణ, శ్రీనివాస్, మావుళ్లస్వామిలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహాలను మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరులో విషాదఛాయలు



లంకే సూరిబాబు



వనమాడి సాయిబాబు

బతుకుతెరువులో భాగంగా తెల్లవారుజామునే ఇంటి నుంచి వ్యాన్‌లో వలలు వేసుకుని చెరువులలో చేపల వేటకు ఆలమూరు మత్స్యకారులు వెళుతుంటారు. దీనిలో భాగంగానే ఐదుగురు మత్స్యకారులు బోలెరావ్యాన్‌లో ఆలమూరు నుంచి రాజానగరం మండలం తుంగపాడు గ్రామంలోని చెరువులో చేపలవేటకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఈప్రమాదంలో లంకే సూరిబాబు, వనమాడి సాయిబాబు మృతి చెందారు. మృతి చెందిన సూరిబాబుకు భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు. మరో మృతుడు సాయిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈప్రమాదంలో మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఆలమూరు మత్స్యకారుల కాలనీతో తీవ్ర విషాధం నెలకొం ది. మృతుల కుటుంబాలు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

అనుమానాస్పద మృతిపై వీడిన మిస్టరీ

- మద్యంమత్తులో హత్య

తునిరూరల్, మే 31: ఇటీవల కాకినాడజిల్లా తునిలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా రైల్వే ప్రహరీగోడ అనుకుని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కేసును పోలీసులు చేధించారు. ఈ వివరాలను తుని సీఐ సీతారామకృష్ణ వెల్లడించారు. తుని రైల్వేట్రాక్‌పై దేవుడురాజు బెగ్గింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడు యడ్ల అప్పారావు ఇరువురికి పరిచయం ఉంది. అప్పారావు రైళ్లలో ఖైనీలు, సిగరెట్లు అమ్ముతూ జీవనం సాగించేవాడు. తునిలో రైలు దిగిన ప్రతీసారీ దేవుడు రాజుతో కలిసి మద్యం తాగేవాడు. మే 25న ఇద్దరు కలిసి మద్యం తాగి డబ్బుల విషయంలో గొడవపడి అప్పారావు దేవుడురాజును ముఖం మీద కొట్టి కాళ్లతో తన్ని, తలను రోడ్డుకేసి గుద్దడంతో మృతి చెందాడు. దేవుడు రాజును అక్కడే వదిలేసి యడ్ల అప్పారావు యలమంచిలి వెళ్లిపోయాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడిని గుర్తించి పట్టుకున్న తుని టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్స్ కె.రాజాభూషణం, ఎం.నాగేశ్వరరావులను సీఐ అభినందించారు.

మాస్ మూవీ దేవకీ నందన వాసుదేవ

- హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల, నిర్మాత బాలకృష్ణ సోమినేని



సమావేశంలో మాట్లాడుతున్న హీరో అశోక్ గల్లా

రాజమహేంద్రవరం సిటీ, మే31 : దేవకీ నందన వాసుదేవ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల ,నిర్మాత బాలకృష్ణ సోమినేని అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హనుమాన్ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే ,దర్శకత్వం చేసిన ప్రశాంత్ వర్మ అందించిన కథతోనే ఈ సినిమా తెరకెక్కించినట్టు చెప్పారు. అశోక్ గల్లా మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ ఆశీస్సులతో ఆయన పుట్టిన రోజున శివజ్యోతి థియేటర్‌లో అభిమానుల సమక్షంలో దేవకీ నందన వాసు దేవ సినిమాలో కీలక పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇది మాస్ సినిమా అన్నారు. ఈ సినిమా తర్వాత తాను సితార ప్రొడక్షన్ బ్యానర్‌లో చేస్తున్నానని చెప్పారు. చిత్ర దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ గుణ 369 సినిమా చేసిన తాను అశోక్ గల్లాతో సినిమా చేయడం ఆనందంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే బీఈడీ చేసి ఉపాధ్యాయుడిగా పనిచేసిన తాను సంగీత దర్శకుడిగా ఈ చిత్రానికి సంగీతం అందించి ఇక్కడే పాటను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. పాటను పాడి అలరించారు. నిర్మాత బాలకృష్ణ సోమినేని మాట్లాడుతూ సినిమాలో విశ్రాంతి తర్వాత వచ్చే సీన్‌ను ఎవరూ ఊహించలేరని అంత గొప్పగా ఈ సినిమా ఉంటుందన్నారు. మా సినిమాలో మంచి కథ ఉంది, కథనం ఉంది. దమ్ముందని తప్పకుండా అందరినీ అలరిస్తుందన్నారు.

రైలు ఢీ కొని మహిళ మృతి



తునిరూరల్, మే 31: గొల్లప్రోలు, రావికంపాడు రైల్వే స్టేషన్ మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని 35 సంవత్సరాల వయస్సుగల మహిళ మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఈ ఘటనను పోలీసులు పరిశీలించగా సంబంధిత మహిళ వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతురాలు ముక్కుపొడుము రంగుచీర, పింక్ కలర్ జాకెట్ ధరించి చామన ఛాయ రంగు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచామని సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

రాళ్లు ఢీకొని బోటు ధ్వంసం

- రూ. 4లక్షల నష్టం

ఉప్పాడ(కొత్తపల్లి) మే 31: లంగర్ తాడు తెగిపోవడంతో రాళ్లను ఢీకొన్న సంఘటనలో బోటు అడుగుభాగం ధ్వంసమైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగింది. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఉప్పాడకు నాయకర్ కాలనీకి చెందిన ఉమ్మిడి జగన్నాధంకు చెందిన బోటును వేట నిషేధం కారణంగా స్థానిక ఉప్పుటేరు కాలువలో లంగర్ వేశాడు. శుక్రవారం సముద్రంలో వచ్చిన పోటు,పాట్లకు కెరటాల ఉధృతికి లంగర్ వేసిన బోటు తాడు తెగిపోవడంతో పక్కనేఉన్న వంతెనరాళ్లకు బోటు ఢీకొట్టింది. దీంతో అడుగుభాగం పూర్తిగా పాడైంది. ఈసంఘటనలో సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని సర్పంచ్ తెలిపారు.

గుమ్ముళూరులో వ్యక్తి అనుమానాస్పద మృతి

కోరుకొండ, మే 31: మండలంలోని గుమ్ముళూరులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన మాదంపూడి రమేష్(35) గుమ్ముళూరుకు చెందిన చిన్న సత్యవతిని పెళ్లి చేసుకుని అత్తింటికి వచ్చేశారు. అదే గ్రామంలో వేరే ఇంటిలో కాపురం ఉంటున్నారు. వారికి 13 ఏళ్ల కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య తగాదాలు తలెత్తాయి. రమేష్ తాగుడుకు బానిసై కుటుంబ పోషణ పట్టించుకోవడంలేదని సత్యవతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి వచ్చింది. అమ్మగారి ఇంటి వద్దే ఉంటోంది. దీంతో రమేష్ ఒక్కడే తన ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు కుమారుడు గణేష్ తన తండ్రిని చూడడానికి వచ్చాడు. ఇంట్లో వేలాడుతున్న తండ్రి మృతదేహాన్ని చూసి తల్లికి చెప్పాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందకి దించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ ఆనంద్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

ఆరోగ్య ప్రదాయిని..

- రోగ నిరోధక శక్తిని పెంచే పాలు
- ఆరోగ్యవంతమైన జీవనానికి పాలే ప్రధానం
- నేడు ప్రపంచ పాల దినోత్సవం



పాడి పశువులు



పాల ఉత్పత్తుల పెంపుదలపై వివిధ దేశాలు విడుదల చేసిన నాణేలు



పాల దిగుబడిలో పోటీపడే తార్‌పార్

అమలాపురంరూరల్, మే 31: ఒకప్పుడు పాడితోనే పంట ముడిపడి ఉండేది. అందుకే పాడిపంటలు అనేవారు. పాడి నుంచి ప్రకృతి సిద్ధంగా లభించే పెంటే ఎరువుగా పంటలు పండించేవారు. ఎటువంటి ఎరువులు, పురుగుమందులు వినియోగించేవారు కాదు. దాంతో ఆరోగ్యవంతమైన పంటలను రైతులు పండించేవారు. ఆరోగ్యవంతమైన పంట దిగుబడులతో రోగరహితంగా ప్రజలు ఒకప్పుడు జీవించారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తికాదు. ఆధునిక సమాజం పాడినుంచి పంటను దూరం చేస్తుంది. పాడి పెంపకానికి అవసరమైన గడ్డి కూడా దొరకని పరిస్థితికి వ్యవసాయ యాంత్రీకరణ విధానాలు అందుబాటులోకి వచ్చేశాయి. వేలకు వేలు చెల్లించినా ఎండుగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. దాంతో పాడి పెంపకమంటేనే రైతులు భయపడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీని ప్రభావం పాల ఉత్పత్తులపై తీవ్రంగా పడింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా పాల ఉత్పత్తులు ఏనాడో తగ్గిపోయాయి. పాడిపంటల్లో ముందుండే కోనసీమ వంటి ప్రాంతాల్లోనే పాలను దిగుమతి చేసుకునే దుస్థితి ఏర్పడింది. దానికితోడు పాలపొడితో, కల్తీ పాలతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన పాల దిగుబడులు కోసం ఐక్యరాజ్యసమితి నడుం బిగించింది. ప్రపంచ ఆహారసంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా జూన్1న ప్రపంచ పాలదినోత్సవాన్ని నిర్వహించాలని ప్రకటించింది.

శ్రేష్ఠమైన ఆహారం పాలు

సృష్టిలో శ్రేష్ఠమైన ఆహారంగా మొదట చెప్పుకునేది పాలనే. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఒంటెలు, గాడిదలు..ఇలా క్షీరదజాతి పాడిపశువులు, జంతువులు పాల ఉత్పత్తులకు ముఖ్య వనరులుగా ఉన్నాయి. అనేక జబ్బులను తగ్గించుకునేందుకు, రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు వందలాది రూపాయలు వెచ్చించి గాడిద పాలు కొనుగోలుచేసి తాగుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్యవంతమైన జీవనానికి పాలే ప్రధానంగా నిలుస్తాయి. పాలలో ఆరోగ్యానికి అవసరమైన ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు ఇతర పదార్థాలు పుష్కలంగా ఉండటంవల్ల సమీకృత ఆహా రంగా పాలను ప్రకటించారు. రోగనిరోధక శక్తిని పెంపొందింపజేయడంతోపాటు తక్షణశక్తిని అందించేది పాలుమాత్రమే.

నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి



జిల్లాలో 2.29లక్షల పాడి పశువుల నుంచి సగటున నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుంది. దేశవాళీ ఆవులు, గేదెలను వేర్వేరుగా జెర్సీ ముర్రా జాతి పశువులతో సంకరణం చేయడం వల్ల పాల ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. రాష్ట్రంలోని జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. రైతులకు అవసరమైన టోటల్ మిక్సడ్ రేషన్(టీఎంఆర్)ను అత్యధికంగా జిల్లాలోనే 80శాతం రాయితీపై పాడి రైతులకు అందజేశాం. గత రెండేళ్లలోను రూ.2.50 కోట్ల విలువైన టీఎంఆర్‌ను పాడి రైతులకు అందించాం.

● డాక్టర్ కర్నీడి మూర్తి,
డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, అమలాపురం

జిల్లాలో ఆవులకంటే గేదెలే ఎక్కువ

జిల్లాలో తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి గోవులే అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.29లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 1,53,542 గేదెలు, 75,460 ఆవులు ఉన్నాయి. పంజాబ్ నుంచి ముర్రా జాతి గేదెలను ఎక్కువగా దిగుమతి చేయడం జరిగింది. ముర్రా జాతి గేదెల వీర్యంతో దేశీయ గేదెలను సంకర పరచడం ద్వారా పాల ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. గేదెలకు మాత్రమే ఈ విధానాన్ని పరిమితం చేయలేదు. జెర్సీ ఆవులను దేశవాళీ ఆవులతో క్రాసింగ్ చేయడంవల్ల పాల ఉత్పత్తి పెరిగేలా ఆవుల పెంపకం జరిగింది.

పాలతో ప్రయోజనాలు

పాలు తాగడం వల్ల మనిషికి అవసరమైన కాల్షియం లభిస్తుంది. పచ్చి పాలలో పోషక విలువలు, కాల్షియం ఉన్నప్పటికీ రకరకాల సూక్ష్మజీవుల వల్ల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. గేదె పాలలో కొలస్ట్రాల్ శాతం తక్కువగా ఉండి మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. వెన్న శాతం గేదెపాలలోనే ఎక్కువగా ఉంటుంది. ఆవుపాలతో సమానంగా మేక పాలు మంచిని చేస్తుంటుంది. లాక్టోస్ సమస్యలు ఉన్న చిన్నపిల్లలకు ఆవుపాలకంటే మేక పాటు ఇవ్వడం మేలు, ఇక పాలతో ఎన్నో ఉపఉత్పత్తులు తయారవుతున్నాయి. పాల నుంచి ఉత్పత్తి అవుతున్న పన్నీర్‌కు మంచి డిమాండు ఉంది.

లక్ష మల్లెల పూజ


మల్లెలతో అర్చన

ప్రత్తిపాడు, మే 31: ప్రత్తిపాడు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. శ్రీ గోదా రంగనాధ గోష్టి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు చామంతి కృష్ణమోహన్, సూర్యమణి దంపతులు భక్తుల సహకారంతో చేశారు. భక్తులు లక్ష అష్టోత్తర శతనామావళి, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

నిప్పుల కుంపటి!

» మండుతున్న ఎండలు
» అల్లాడుతున్న ప్రజలు
» నిర్మానుష్యంగా రహదారులు

ప్రత్తిపాడు, మే 31: వేసవి ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దీంతో వాతావరణం నిప్పుల కుంపటిగా మారింది. మండలంలో శుక్రవారం వీచిన వడగాల్పులు ప్రజలు బెంబేలెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. రోహిణి వడగాల్పులకు జాతీయ రహదారిపై ప్రయాణించిన వాహనాలను రోడ్డు మార్జిన్ దిగి చెట్ల కింద నిలిపి డ్రైవర్లు సేదతీరారు. భగభగమండే ఎండ తీవ్రతకు వాహన టైర్లు దెబ్బతింటాయని వాహనదారులు ముందు జాగ్రత్తగా చెట్లు వద్ద నిలిపి సేదతీరారు.


ప్రత్తిపాడులో బైక్‌పై వెళ్తూ ఎండకు ఇద్దరి పిల్లలకు టవల్ చుట్టి చెట్టుకింద ఆగిన దంపతులు

నీరు లేక ఎండిపోయిన చెరువులు

వేసవి ఎండలు పెరగడం, వర్షాలు లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని ధర్మవరం రామభద్రరావు చెరువు, వెంకట్రావు చెరువు, పేర్రాజు చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. పోతులూరు పెద్ద చెరువు, వాకపల్లి చెరువులు అడుగంటిపోయాయి. ప్రత్తిపాడులోని పుత్ర చెరువు, గోవిందపురం చెరువు, రాచపల్లి కొత్త చెరువు, ఒమ్మంగి రాజు, గోపాలుడు చెరువుల్లో నీటి నిల్వలు బాగా అ డుగంటి పోయాయి. శరభవరం పెద్ద చెరువు,చింతలూరు రామానుజం చెరువులు కూడా నీటి నిల్వలు తగ్గిపోయి పశువులకు తాగునీటి కొరత సమస్య ఏర్పడింది. పంట పొలాల్లో పశుగ్రాసం కొరత, చెరువుల్లో నీరు అడుగంటడంతో తాగునీటి కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ప్రత్తిపాడు మండలం రాచపల్లి వద్ద ఎండిపోయిన పోలవరం కాలువ

భానుడి భగభగలు...

కొత్తపల్లి: మండల తీరప్రాంతాల్లో శుక్రవారం సూర్యుడు భగభగమని నిప్పులు కక్కడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. చీకటి పడ్డాక కూడా వేడిగాలులు కొనసాగడంతో సతమ తమతమవుతున్నారు.ఇంకా ఎన్నాళ్లీ మంటలని గగ్గోలు పెడుతున్నారు.

ప్రజలకు తప్పని ఇబ్బందులు...

తుని రూరల్: గత రెండు రోజుల నుంచి మండలంలో ఎండలు మండిపోతున్నాయి. దీనికి తోడు వడగాల్పులు తీవ్రంగా వీస్తున్నాయి. భానుడి ప్రతాపానికి వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు వేళాపాళా లేని విద్యుత్ కోతలు ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరో నాలుగు రోజులు పాటు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. మండే ఎండల్లో తిరగడం మంచిది కాదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

న్యాయసేవా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు

పెద్దాపురం, మే 31: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం మండల న్యాయసేవాధికార సంఘం పరిధిలో న్యాయసేవా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపేట, జగ్గంపేట, పెద్దాపురం, గండేపల్లి మండలాల నుంచి ఈ కార్యకర్తల నియామకం జరుగుతుందన్నారు. మండలాల వచ్చిన దరఖాస్తుల్లో 25 మందిని ఎంపిక చేస్తామన్నారు. శిక్షణ పొందిన తరువాత ఆయా మండలాల్లో న్యాయసేవా కార్యకర్తలుగా పనిచేయాల్సి ఉంటుందని, అలాగే వారికి గుర్తింపు కార్డును ఇస్తామన్నారు. టీచర్స్ (రిటైర్ అయిన వారు కూడా), విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, ఎంఎస్‌డబ్ల్యూ చదువుతున్న విద్యార్థులు, అంగన్‌వాడీ వర్కర్లు, డాక్టర్లు, ఫిజిషియన్స్, న్యాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సామాజిక సేవా సంస్థల్లో పనిచేసే వారు, ఎన్‌జీవో క్లబ్ సభ్యులు, పొరుగు మహిళా సమూహాల సభ్యులు, మైత్రీ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అట్టడుగు, వివిధ రకాల బాధితులు, గృహిణులు, సేవా దృక్పథం కలిగినవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి ఇతర సాంకేతిక ధృవపత్రాలు, సామాజిక సేవా పనులకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్టు కలర్ ఫోటోతో గెజిటెడ్ అధికారి సంతకంతో జూన్ 25లోగా పెద్దాపురం కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న మండల న్యాయసేవా సంఘంలో సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.

'శేష జీవితంలోనూ సేవలందించేది వైద్యులే'


డాక్టర్ హరివిజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జీజీహెచ్ (కాకినాడ), మే 31: ప్రతి ఉద్యోగి జీవితంలోను రిటైర్మెంట్ అనేది ఉంటుందని కేవలం వైద్యులు మాత్రమే వారి శేష జీవితం అంతా సేవలందించే అవకాశాన్ని దేవుడు కల్పించాడని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అన్నారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, మెడిసన్ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ హరివిజయ్‌కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా సూపరింటెండెంట్ ఛాంబర్‌లో శుక్రవారం ప్రత్యేక అభినందన కార్యక్రమం మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్య క్షుడు, జీజీహెచ్ జేఏసీ ఛైర్మన్ పాలపర్తి మూర్తిబాబు ఆధ్వర్యంలో జరిగింది. సూపరింటెండెంట్ మాట్లాడుతూ డాక్టర్ హరివిజయ్‌కుమార్ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, హెచ్‌వోడీగా నిష్ణాతుడైన వైద్యుడిగా 25ఏళ్ల పాటు జీజీహెచ్‌లో సేవలందించారన్నారు. కొవిడ్ సమయంలో అందించిన సేవలు మరువలేనివన్నారు. ఏడీ అనురాధ, ఏవో శేషేంద్రశర్మ, ఎన్‌జీఓ సంఘ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ,మేనేజర్ నరసింహరావ్ పాల్గొన్నారు.

'శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి'

జగ్గంపేట, మే 31: జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోని గ్రామాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా ప్రజలకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని రైతు కూలీ సంఘం నేత కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం జగ్గంపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో తూతూమంత్రంగా పర్యటించి చేతులు దులుపుకున్నారన్నారు. వాటర్ ట్యాంకుల నుంచి వాటికి చెంతనే ఉన్న పామాయిల్ తోటలకు నీటిని ఇస్తున్నారని, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. భావారంలో ట్యాంకుల వద్ద శుద్ధి చేసిన నీరు, పంచాయతీ నీటితో కలుస్తుందన్నారు. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో సుద్ద నీరు పడుతుందని, దీన్ని తాగడంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారన్నారు. గ్రామాలకు పైపు లైన్‌లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజబాబు, అంజిబాబు, రామలింగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

'ఇంజనీరింగ్ విభాగంలో సిబ్బందిని నియమించాలి'

పెద్దాపురం, మే 31: రహదారులు భవనాల శాఖలో ఇంజనీరింగ్ విభాగంలో సిబ్బంది నియామకం త్వరితగతిన చేపట్టాలని ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక రహదారులు భవనాల శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారుల భవనాల శాఖలో ఎంతో అనుభవం కలిగిన సాంకేతిక సిబ్బంది పదవీ విరమణ చేశారని, కనీస సిబ్బంది లేక ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి పడుతోందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో వేలాదిగా ఖాళీలు ఏర్పడ్డాయని ప్రభుత్వాలు దీనిపై శ్రద్ధ తీసుకుకోవాలని కోరారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వర్క్ ఇనస్పెక్టర్లు మహమ్మద్ గౌస్, దంతులూరి రామరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ర.భ ఇంజనీర్లు ఎం.గణేశ్వరరావు, అంబటి ప్రకాశరావు, ఆర్.సత్యనారాయణ, గిరిప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

భిక్షాటన, బడిబయట పిల్లల గుర్తింపు కార్యక్రమం

కార్పొరేషన్ (కాకినాడ), మే 31: కాకినాడ జిల్లా శ్రీయుత జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, స్త్రీ శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకట్రావు, ప్రొటెక్షన్ అధికారులు కె.శ్రీనివాస్, జె.విజయ అధ్యక్షతన కాకినాడ పట్టణంలో భిక్షాటన, బడిబయట పిల్లల గుర్తింపు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా బస్టాండ్, రైల్వేస్టేషన్, పబ్లిక్ ట్రాఫిక్ ప్రాంతాలు, ఆటోస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చైల్డ్ బెగ్గింగ్, చైల్డ్ ట్రాఫికింగ్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, బడిబయట పిల్లలు నమోదు, భిక్షాటన చేయడం నేరమని అవగాహన కల్పించారు. పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త కె.హరికృష్ణ, ఐసీపీఎస్ సిబ్బంది సుధాకర్, దుర్గరాణి, విశుభ, దుర్గభవానీ, చినబాబు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి వినోదం కార్యక్రమం

కరప, మే 31: స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంలో మే 21 నుంచి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జన విజ్ఞాన వేదిక కరపమండల శాఖ ఆధ్వర్యంలో గత 10 రోజులుగా విద్యార్థులకు ఓరిగామి, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు, సైన్స్ ప్రయోగాలు, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్కిల్స్, గణితంలో మెళకువలను నేర్పించారు. ప్రతిభ కనబరిచినవారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. క్యాంప్ విజయవంతంగా ముగిసినందున జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వి.శ్రీరామారావును సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.రాంప్రసాద్, కె.సత్తిబాబు, ఆర్.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు దేగల లక్ష్మి, వై.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికుడు ఎన్.సత్తిబాబు పాల్గొన్నారు.

'వలంటీర్లకు న్యాయం చేయాలి'

ఏలేశ్వరం, మే 31: రాజీనామా చేసిన వలంటీర్లకు వైసీపీ న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు, కౌన్సిలర్ అలమండ చలమయ్య డిమండ్ చేశారు. శుక్రవారం తన నివాసంలో మాట్లాడుతూ పట్టణంలో ఎన్నికలకు ముందు బలవంతంగా వలంటీర్లతో రాజీనామా చేయించిన వైసీపీ నాయకులు వారికి ఇస్తానన్న జీతాలు నేటికీ ఇవ్వలేదని, రాజీనామాల అనంతరం ఎన్నికల్లో ప్రచారాలకు వాళ్లని వాడుకున్నారన్నారు. వలంటీర్ జీతం కాకుండా అదనంగా రూ.10 వేలు, బోనస్‌గా రూ.5వేలు ఇస్తామని వైసీపీ నాయకులు ఆశ కల్పించి రాజీనామాలు చేయించారన్నారు. ఇప్పుడు వారు ఉద్యోగం, జీతాలు లేక రోడ్డున పడ్డారని వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు.

'విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించాలి'

తాళ్లరేవు, మే 31: విద్యార్థులకు వివిధ రకాల సర్టిఫికెట్లను సకాలంలో అందించి సహకరించాలని టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యార్థులు వివిధ కోర్సులకు టెస్టులు, కౌన్సిలింగ్‌లకు దరఖాస్తులు చేసుకోవడానికి ఆదాయం, కుల ధ్రువపత్రాల కోసం తహాశీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నారని, వారికి ఏ ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన

గండేపల్లి, మే 31: కౌమార దశలో బాలికలకు నెలవారీ వచ్చే రుతుక్రమం, ఆ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రతపై సీడీపీవో పూర్ణిమ సుబ్బయ్యమ్మపేట ఏడబ్ల్యూసీలో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతీ నెల ఎల్ఎంపీ నుంచి 28రోజులకు రుతుక్రమం వస్తుందని అలా రాకపోతే డాక్టర్‌ను కలిసి మందులు వాడాలన్నారు. రక్తహీనత అధిగమించడానికి పోషకాహారం తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, సూపర్‌వైజర్ నాగపార్వతి, ఏఎన్ఎం కె.సైలజా, ఆశావర్కర్లు గంగారత్నం, సాయిలీల, చినలక్ష్మి, అప్పలకొండ, ఏడబ్ల్యూడబ్ల్యూ వీరకుమారి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు

మూలపేట (కొత్తపల్లి), మే 31: కేఎస్‌జెడ్ మూలపేటలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2 నైపుణ్యాకేంద్రాల్లో ఒకటైన కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందిన 31మంది యువతకు ఉయ్యూరు విజయేంద్ర, ఫిల్మ్ డైరెక్టర్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ ఫిల్మ్ యాక్టర్ వాసంశెట్టి కిషన్ శుక్రవారం సర్టిఫికేట్లను అందజేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్లు శరత్‌చంద్ర, నిత్యానందరెడ్డి సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్షలో 62వ ర్యాంకు

సామర్లకోట, మే 31: ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ పరీక్షలో సామర్లకోట మండలం కొప్పవరం గ్రామానికి చెందిన కుమ్మరి నితిన్ సాగర్‌కు రాష్ట్రస్థాయిలో 62వ ర్యాంకు సాధించాడు. నితిన్ సాగర్ కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ డేటా సైన్స్ చదివాడు.

కౌంటింగ్‌లో అడ్డంకులు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, మే 31: ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసిన వైసీపీ నేతలు కౌంటింగ్ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పవన్ గెలుపును అడ్డుకునేందుకు వైసీపీ చేస్తున్న కుట్రల్లో ఇదొక భాగమని ఆరోపించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న దుష్ప్రచారం చూసి ప్రజలే ఆశ్చర్యపోతున్నారన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో నెగ్గే జనసేన అధినేత పవన్ ఎన్నికను పాడు చేయాలనే కుట్రతో సీఎం జగన్ ఉన్నారని ఆరోపించారు. రౌడీషీటర్లను ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించే కుట్ర జరుగుతుందన్నారు. వైసీపీ నాయకులు ఇండిపెండెంట్ అభ్యర్థులు వద్ద ఏజెంటు ఫారాలు తీసుకుని రౌడీమూకలను కౌంటింగ్‌లోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కౌంటింగ్‌ను ఏదొక విధంగా నిలుపుదల చేయాలని చూస్తున్నారని, దీనిపై ఎస్పీ దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, నాయకులు గుండ్ర సుబ్బారావు, బర్ల అప్పారావు, సోము సత్యనారాయణ, పిల్లి చిన్నా, నామా దొరబాబు, బొజ్జా సూరిబాబు, అద్దూరి శ్రీను, కొరుప్రోలు శ్రీను, మొల్లి నాగమరిడిరాజు, గుత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేగా నానాజీ విజయం తథ్యం

టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల కోఆర్డినేటర్

కాకినాడ సిటీ, మే 31: కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యేగా పంతం నానాజీ విజయం తథ్యమని టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్న ప్రజలు ఎన్డీఏ కూటమికి ఓట్లు వేశారన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రం, జిల్లాలోను కూటమి అభ్యర్థులే విజయం సాధించి 140 నుంచి 16 సీట్లతో అధికారంలోకి వస్తామన్నారు. ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యేగా నానాజీ గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఎంతో కృషి చేశారన్నారు. ఎన్నికల్లో సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు నులుకుర్తి తెలిపారు. నాయకులు మల్రివాడ బుజ్జి, నులుకుర్తి జగన్నాధం, దమ్ము నూకరాజు, మల్లంపల్లి నారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

'ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలి'

గొల్లప్రోలు రూరల్, మే 31: ఎన్నికల కౌంటింగ్ సమయంలో ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో శుక్రవారం సాయంత్రం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కౌంటింగ్ అనంతరం ఎటువంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎటువంటి వివాదాలకు తావివ్వవద్దని సూచించారు. గొడవలు, ఘర్షణలకు దిగేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ ఉన్నారు.

'కఠిన చర్యలు తప్పవు'

ఏలేశ్వరం, మే 31: ఎన్నికలు ఫలితాలు వెలువడే సమయంలో ప్రజలు ఘర్షణలు, పంతాలకు పోకూడదని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పెద్దనాపల్లి గ్రామస్తులతో తహశీల్దార్ రంగారావు సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144, పోలీసు యాక్ట్ 30 సెక్షన్లు అమలులో ఉన్నందున బెట్టింగులకు పాల్పడకూడదని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదని, ఎవరైనా ప్రశాంతతకు భంగంకలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పిల్లంకలో ఇసుక సీజ్

తాళ్లరేవు, మే 31: పిల్లంక రెవెన్యూగ్రామం గౌతమీగోదావరి నది ఒడ్డున అక్రమంగా నిల్వచేసిన ఇసుకను తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ అధికారి రవితేజ సీజ్ చేశారు. మే 20న కలెక్టర్ ఇసుకర్యాంపులను సందర్శించి గోదావరిఇసుకను బయటకు తీసుకువచ్చేందుకు అనుమతులు లేవని ర్యాంపుల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అయినా అక్రమార్కులు ఇసుకను తరలించడం మానలేదు. గురువారం 3 నావలపై ఇసుకను తీసుకువచ్చి పిల్లంక సర్వేనెంబర్ 84 కోన వెంకటేశ్వర్లుకు చెందిన స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు నిల్వచేశారని అధికారులు తెలిపారు. ఈ ఇసుకను సీజ్ చేసి వీఆర్వోలు, వీ ఆర్ఏలను కాపలాగా పెట్టారు. వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, వీఆర్ఏలు రాంబాబు, పండు పాల్గొన్నారు.

రోగాలకు మూలం పొగాకు వినియోగం

డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్


ర్యాలీలో డీఎంహెచ్‌వో, వైద్యసిబ్బంది

జీజీహెచ్ (కాకినాడ), మే 31: మానవ దేహంలోని సున్నితమైన అవయవాలకు త్వరితగతిన సంక్రమించే రోగాలకు మూలం అధికశాతం పొగాకు వినియోగమని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పొగాకు వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగాకు వాటి ఉత్పత్తుల వల్ల ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాల వల్ల అనారోగ్యం పాలవడమే కాకుండా అతడి కుటుంబ పరిస్థితి కూడా చిన్నాభిన్నమౌతుందన్నారు. ఈ ఏడాది పొగాకుకు వీడ్కోలు-ఆరోగ్యానికి స్వాగతం అనే నినాదం ద్వారా ప్రజలకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పొగాకు ద్వారా ఊపిరితిత్తులు, నోరు, గొంతు, అండాశయం, మూత్రపిండాలు తదితర అవయవాల్లో క్యాన్సర్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గుండెపోటు, రక్తనాళలు మూసుకుపోవడం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వస్తాయన్నారు. సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడంతో పాటు ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. ముఖ్యంగా మెదడులోని నాళాల్లో రక్తప్రసరణకు అడ్డంకులు ఏర్పడతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే జరిమానాతోపాటు జైలుశిక్ష పడుతుందన్నారు. స్కూల్‌లు, కాలేజీలకు 100మీటర్ల దూరం వరకు ఏ పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్ ఉన్నారు.

'ధూమపానానికి దూరంగా ఉండాలి'

సర్పవరం జంక్షన్, మే 31: ప్రాణాంతక వ్యాధులకు దూరగా సంపూర్ణ ఆరోగ్యం కోసం యువత ధూమపానానికి దూరంగా ఉండాలని కాకినాడ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ కోరారు. శుక్రవారం వలసపాకల ఏఎంఎం ఫౌండేషన్ ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా నోటి కేన్సర్‌పై అవగాహన సమావేశం, వైద్య శిబిరం నిర్వహించారు. ధూమపానం వ్యసనం నుంచి దూరం చేసేందుకు అవసరమైన నికోటెక్స్ చూయింగ్ గమ్స్‌ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చైతన్య, సిరాజ్, దీప ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న డీఈవో


ప్రత్తిపాడు, మే 31: జిల్లాలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి టి.రమేష్ కోరారు. ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట మండలాల ఎంఈవోలు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల నమోదు లక్ష్యాలను సాధించాలన్నారు. చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా హెచ్ఎంలు కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ కూడా గణనీయంగా పెంపుదల చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవోలు వి.రాజుబాబు, వై.అచ్చిరాజు, అబ్బాయి, వరలక్ష్మి, స్వామి.. సీఆర్పీలు రాంజీప్రసాద్, భాషా, మల్లేష్ పాల్గొన్నారు.

బడిపిల్లల నమోదు పెంచాలి

అన్నవరం, మే 31: ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు బడిపిల్లల నమోదు పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక దేవస్థానం హైస్కూల్‌లో శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు మండలాల ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై నాణ్యమైన విద్యను అందించడం, ఆంగ్లమాధ్యమం తదితర సౌకర్యాలు ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేసినట్టు వివరించాలన్నారు. పిల్లలో కనీస అభ్యసనస్థాయి ఎలా పెంచాలి, ఉపాధ్యాయుల బాధ్యతలు, పాఠశాల సమర్థ నిర్వహణపై ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో శంఖవరం ఎంఈవో రమణ, 3 మండలాల నుంచి 200మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో భారీగా అవినీతి

పిఠాపురం కౌన్సిల్‌లో కౌన్సిలర్లు ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం, మే 31: ఎటువంటి పనులు చేయకుండానే లక్షల్లో బిల్లులు చేశారని, ఇందులో పలువురికి వాటాలున్నాయని, ఇంజనీరింగ్ విభాగంలో కోట్లాది రూపాయిల అవినీతి జరిగిందని కౌన్సిలర్లు ఆరోపించారు. ఇందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో వైస్‌చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడివేడిగా జరిగింది. వైసీపీ కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో అవినీతికి అంతులేకుండా పోతుందన్నారు. పెట్రోల్, డీజిల్ పేరిట లక్షలాది రూపాయిలను స్వాహా చేస్తున్నారని తెలిపారు. కోట్లాది రూపాయిల అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. పలు వార్డుల్లో పనులు చేయకుండా లక్షలా ది రూపాయిలు బిల్లులు చేయించుకున్నారని మరో వైసీపీ కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో కొందరు కౌన్సిలర్ల హస్తం కూడా ఉందని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అన్ని వివరాలు ఆధారాలతో సహ బయట పెడతానని తెలిపారు. పనిచేయని బోర్లకు మరమ్మతులు చేసినట్టు చూపించి బిల్లులు చేయించుకుంటున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ ఆరోపించారు. పట్టణంలోని పలు వార్డుల్లో తీవ్ర మంచినీటి సమస్య ఉందని, అధికారులు పట్టించుకోవడంలో విఫలమయ్యారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని తెలిపారు. సమావేశంలో కమిషనరు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలుచేయాలి


సీసీహెచ్‌లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కరప, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశిత నిబంధనలను అనుసరించి మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలుచేయాలని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ సూచించారు. కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కుక్ కమ్ హెల్పర్స్(సీసీహెచ్)లకు ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. మెనూ వంటకాలపై తాజ్ హోటల్‌లో శిక్షణ పొందిన పెద్దాపురప్పాడు హైస్కూల్ సీసీహెచ్‌లు జి.గంగాభవానీ, సీహెచ్.దుర్గాభవానీ వంటలో మెళకువలను తెలిపి శిక్షణ అందించారు. హెచ్ఎం కె.స్వర్ణరాణి, కాకినాడ అర్బన్, రూరల్ మండలాల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, సీహెచ్.రవి, ఎన్.ఏసుదాసు ఉన్నారు.

ఘనంగా చండీహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, మే 31: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.

నేరేళ్లమ్మకు కుంకుమపూజలు

గ్రామదేవత నేరేళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా కొండదిగువ దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కుంకుమపూజలు నిర్వహించారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి అధికంగా మహిళలు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న నెహ్రూ

జగ్గంపేట, మే 31: ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో టీడీపీ కూటమి జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మహారాష్ట్రలోని ఉజ్జయిని పుణ్యక్షేత్రంలో మహంకాళేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు ఎన్డీయే కూటమికి అనుకూలంగా వచ్చి ప్రతీ అభ్యర్థి విజయం సాధించాలన్నారు. ముఖ్యంగా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, పవన్‌కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించాలని, జగ్గంపేట నుంచి తాను నాల్గోసారి ఎమ్మెల్యేగా విజయంసాధించే విధంగా ఆ పరమశివుడి ఆశీస్సులు అందించాలని పూజలు చేశామన్నారు. ఆయన మనవడు జ్యోతుల అనీష్ నెహ్రూ ఉన్నారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ

కరప, మే 31: వేళంగి గ్రామానికి చెందిన గందం ఝాన్సీ సత్యశ్రీ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. స్కూల్‌కి వెళ్లి రావడానికి పడుతున్న ఇబ్బందిని గుర్తించిన జనసైనికుడు శాకా శ్రీనివాస్ కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలుకు విన్నవించాడు. దీంతో తాతీలు కాకినాడ రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపు కాశీవిశ్వనాథ్, అరిగెల పెదబాబిలను సంప్రదించడంతో స్పందించి బాదం జయరామ్‌గోపాల్ ద్వారా విద్యార్థికి సైకిల్ అందించారు.

ప్రత్తిపాడులో డీవైఈవో తనిఖీ

ప్రత్తిపాడు, మే 31: ప్రత్తిపాడు మండల విద్యాశాఖ కార్యాలయాన్ని శుక్రవారం పిఠాపురం డీవైఈవో ఎం.వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. మండల వనరుల కేంద్రంలో రిజిస్టర్లను, బోధనా సామాగ్రిని పరిశీలించారు. మండలంలోని నాడు-నేడు ప్రగతిని డీవైఈవో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో వి.రాజుబాబు, ఎంఈవో2 అచ్చిరాజు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కి సత్కారం

ఏలేశ్వరం, మే 31: ఏలేశ్వరం నగర పంచాయితీలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న పీఎస్.ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా ప్రసాద్ దంపతులను మున్సిపల్ కమిషనర్ శివ ప్రసాద్, మేనేజర్ కె.శ్రీనివాసరావు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద్, అనూష, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోకు సన్మానం

కరప, మే 31: స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం పదవీ విరమణ పొందిన వ్యవసాయ విస్తరణాధికారి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఏడీఏ కె.బాబూరావు, ఏవో అప్పసాని వెంకట రాజేష్, సహచర ఏఈవోలు, వీఏఏలు తదితరులు ఉన్నారు.

కౌంటింగ్‌పై ఏజెంట్లకు సూచనలు

గండేపల్లి, మే 31: జూన్ 4న జరగబోయే ఎన్నికల కౌంటింగ్‌పై ఏజెంట్లు, కార్యకర్తలకు జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పలు సూచనలిచ్చారు. మండలంలోని మల్లేపల్లి గ్రామంలో కొండపై స్వయంభు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. అక్కడే ఉన్న పురాతన బావిని సందర్శించారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

పెద్దాపురం, మే 31: పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరంలో చిన్నారులకు శుక్రవారం పరీక్షలను నిర్వహించారు. కిరణ్ కంటి ఆసుపత్రి (కాకినాడ) సిబ్బంది పరీక్షలు చేసి కళ్లజోళ్లను అందజేశారు. విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా నృత్యంపై శిక్షణ ఇచ్చారు. బుద్దా శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, సత్య, మంజుల, పూజిత, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

సామర్లకోట, మే 31: సామర్లకోట నెంబరు-2 మార్కెట్ చికెన్ వ్యాపారి పైల వీరబాబు శక్రవారం 150 లీటర్ల పెరుగు బకెట్లను కొనుగోలు చేసి చల్లటి మినరల్ వాటర్‌ను కలిపి మజ్జిగను ప్రయాణికులు, ప్రజలకు పంపిణీ చేశారు.